గ్యాస్ సిలిండర్‌పై అదనపు దోపిడీ!

- అక్రమాలకు ఊతమిస్తున్న గ్యాస్ ఏజెన్సీలు
- అరకొర జీతం...ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డెలవరీబాయ్స్
- ఒక్కో సిలిండర్‌పై రూ. 50 వరకు వసూళ్లు
- తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్న అధికారులు...
- సామాన్యుడికి తప్పని భారం


బనగానపల్లె: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచుతూనే ఉంది. దీనికితోడు పెట్రోల్, డీజిలధరలు పెరుగుతుండడంతో నిత్యావసర సరుకులకూ రెక్కలొచ్చాయి. సామాన్యుడికి ఇబ్బందులు తప్పడం లేదు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై గతేడాది మార్చిలో రూ.50, జూలైలో రూ.50 పెంచిన కేంద్రం ఈయేడు రెండు నెలల క్రితం మళ్లీ రూ.50 వడ్డించింది. ఈ బాదుడుతోనే ఇబ్బంది పడుతున్న పేదలపై ఏజెన్సీల నిర్వాహకులు చేతివాటం చూపుతూనే ఉన్నారు. పరోక్షంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ పేదలపై ఆర్థిక భారం మోపుతున్నారు. ఓ విధంగా చెప్పాలంటే డెలివరీ బాయ్స్‌ను అడ్డుపెట్టుకొని అందినంత దోచుకుంటున్నారు. కొన్ని ఏజన్సీలు డెలివరీ బాయ్స్‌కు నెలకు రూ.4వేలకు మించి జీతాలు ఇవ్వడం లేదు. మరికొన్ని ఏజన్సీలు సిలిండర్‌పై కమీషన్ రూపంలో చెల్లిస్తున్నట్లు సమాచారం. దీంతో డెలవరీబాయ్స్ అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. వంట గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నిర్ణీత ధర రూ.1162.50 ఉండగా డెలివరీ బాయ్స్ అదనంగా రూ.40–50లు వసూలు చేస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 5,22,475 కనెక్షన్ల నుంచి అక్రమంగా... అదనంగా చేసిన వసూళ్ల మొత్తంలో సగం ఏజెన్సీల నిర్వాహకులకే చేరుతున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా సంబంధిత అధికారులు తెలియనట్లే వ్యవహరిస్తున్నారనే విమర్శలు అన్నివర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

ఐదు కిలోమీటర్ల వరకు ఉచితంగా డెలివరీ...

జిల్లా వ్యాప్తంగా 32 గ్యాస్ ఏజన్సీలు ఉండగా 5,22,475 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అనుమతి పొందిన గ్యాస్ ఏజన్సీల నిర్వాహకులకు ఒక్కో సిలిండర్ సరఫరా చేసినందుకు రూ.60–70లను కమీషన్ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోంది. ఒక్కో ఏజెన్సీ నిర్వాహకుడికి కమీషన్ రూపంలో రూ.2 లక్షలకుపైగానే ఆదాయం సమకూరుతుందని అంచనా. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు ఏజెన్సీ పరిధిలోని ఐదు కిలోమీటర్ల వరకు వంట గ్యాస్‌ను ఉచిత డోర్ డెలివరీ చేయాల్సి ఉంటుంది. అయితే ఏజెన్సీల నిర్వాహకులు డెలవరీ బాయ్స్‌కు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. అరకొర వేతనాలు ఇస్తుండడంతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అదనపు వసూళ్లు కాదు... సర్వీస్ చార్జ్ అన్నట్లుగా దబాయిస్తున్నారు కూడా. అరకొర పరిజ్ఞానం... తప్పని పరిస్థితుల మూలంగా ప్రశ్నించే తత్వాన్ని ఎప్పుడో కోల్పోయిన సామాన్యుడు అదనపు భారాన్ని నిశ్శబ్దంగా భరిస్తూనే ఉన్నాడు.

గ్యాస్ కనెక్షన్ల వివరాలు

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు:	5,22,475
ఏజన్సీలు:	32
ఐదు కిలోమీటర్లలోపు డెలివరీ రుసుం:	ఉచితం
ఐదు నుంచి 15 కిలోమీటర్లలోపు డెలివరీ రుసుం	రూ.20
15 కిలోమీటర్ల దాటితే	రూ.30



ఫిర్యాదులు అందజేస్తే చర్యలు



ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా వసులు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకు గ్యాస్ ఏజన్సీల నిర్వాహకులు వినియోగదారులకు సిలిండర్లను సరఫరా చేయాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. అక్రమ వసూళ్లు వాస్తవాలు అని తెలితే కఠిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు కూడా ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.
– ఎం.రబ్బాని సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ బనగానపల్లె

అదనంగా రూ.40 వసూళ్లు చేస్తున్నారు



గ్యాస్ డెలవరి బాయ్స్ అదనంగా రూ. 40 వసూళ్లు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కనీసం సమాధానం లేదు. ఖర్చులు ఉంటాయంటూ నిర్లక్ష్యంగా చెబుతూ వెళ్తున్నారు. మాకూ తప్పని పరిస్థితి. దాదాపు ప్రతిఒక్కరి నుంచి వసూళ్లు చేస్తున్న విషయం అందరికీ తెలుసు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో సంబంధింత అధికారులు కూడ పట్టించుకోవడంలేదు.
– షేక్ జమాల్‌వలి, బనగానపల్లె

అక్రమ వసూళ్ల విషయం అందరికీ తెలుసు



గ్యాస్ బాయిస్ అదనంగా వసూళ్లు చేస్తున్న విషయం అందరికీ తెలుసు. ప్రశ్నిస్తే గ్యాస్ ఇవ్వకుంటే ఏమి చేయాలి. దినసరి కూలితో జీవనం సాగించే పేదలు అధికారుల చుట్టూ తిరుడం సాధ్యమా. వారితో వాగ్వాదం చేసే పరిస్థితి సామాన్యుడికి ఉందా. అధికారులే కొంత చొరువ తీసుకుంటే పేదలకు న్యాయం జరుగుతుంది. నిబంధనల ప్రకారం గ్యాస్ డెలవరీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
– నరసయ్య, ఇల్లూరుకొత్తపేట

క్లుప్తంగా

మాతా,శిశుమరణాలు తగ్గించాలి



వ్యాక్సిన్ రికార్డులను పరిశీలిస్తున్న ప్రభావతి

కోవెలకుంట్ల: మాతా, శిశుమరణాల రేటును తగ్గించేందుకు కృషి చేయాలని ఇమ్యునైజేషన్ జిల్లా అధికారిణి ప్రభావతి సూచించారు. శనివారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్‌కు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, ఐఎల్ఆర్ తదితర రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభానిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి రెండేళ్ల వరకు వ్యాక్సినేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 0–2 ఏళ్ల మధ్య కాలంలో ఆరు టీకాలు చిన్నారులు వేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం తల్లి, బిడ్డ సంక్షేమం కోసం ఆసుపత్రుల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు వీరభద్రుడు, గిరిజ, సిబ్బంది పాల్గొన్నారు.

29న వలంటీర్లకు సన్మానం

బనగానపల్లెరూరల్: మండలంలోని వలంటీర్లకు ఈ నెల 29న సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య శనివారం తెలిపారు. స్థానిక పాదుపు భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారన్నారు. వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లెరూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న కేజీఆర్ కాంప్లెక్స్‌లో లావణ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు లావణ్య మహిళా మండలి అధ్యక్షురాలు రోజరమణి శనివారం తెలిపారు. 18–35 ఏళ్లలోపు మహిళలు అర్హులని, 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అవుకు: పట్టణానికి చెందిన మహబూబ్ బాషా అనారోగ్యానికి గురయ్యాడు. కూలీ పనులు చేసుకుంటే జీవనం సాగించే ఆయనకు బ్రెయిన్‌లో బ్లెడ్ క్లాట్ కావటంతో మంచానికే పరిమితయ్యాడు. భర్తతోపాటు ఇద్దరు ఆడపిల్లలు, ఓ అబ్బాయిని పోషించేందుకు భార్య పడుతున్న ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న స్నేహితులు (2006–07 పది బ్యాచ్)అండగా నిలిచారు. ఈ మేరకు శనివారం మిత్రుడు మహబూబ్ బాషాకు రూ.62,500 అందజేశారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని స్నేహితుడికి భరసా ఇచ్చారు.

కౌలుకార్డుపై అవగాహన సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్ రావు

అవుకు: మండల పరిధిలోని శివవరం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు శనివారం కౌలుకార్డుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత సాధించాలంటే తప్పకుండా కౌలుకార్డు ఉండాలని చెప్పారు. ఆర్బీకేలలో గ్రామ వ్యవసాయ సహాయకుల సంప్రదించి కౌలుకార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సాగు మెలకువులను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి

ప్యాపిలి: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ప్యాపిలి మండలంలో పలువురు కార్యకర్తల ఇళ్లకు వెళ్లారు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండయ్య కుమారుడి వివాహం ఇటీవల జరిగింది. ఈ మేరకు కొండయ్య ఇంటికి వెళ్లిన మంత్రి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులును మంత్రి పరామర్శించారు. చంద్రపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దేవముని ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. గ్రామానికి చెందిన మహేశ్వర్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి ఇళ్లకు వెళ్లిన మంత్రి వారితో కాసేపు మాట్లాడారు.

నేడు వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ

డోన్ : స్థానిక కంబాలపాడు సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆదివారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ప్రారంభోత్సవం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమానికి మంత్రితోపాటు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్న కేశవయ్యగౌడ్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి తదితరులు హాజరవుతారని చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు.

సన్మానం

డోన్: నాయీబ్రాహ్మణులకు ప్రత్యేకంగా ఇంటి నివేశన స్థలాల కోసం విశేష కృషి చేసిన రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. మంత్రి బుగ్గన స్వగృహంలో వారికి శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఆర్ఎం మద్దయ్య, సోమశేఖర్, తిరుపాల్, గోపాల్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేట కాలనీకి చెందిన ఎస్. ఖాజా హుసేన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం ఖాజ హుసేన్‌ను పట్టణ ముస్లిం సోదరులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఆంజనేయులు

డోన్ టౌన్ : రైతులకు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు, మందులు, విత్తనాలు విక్రయిస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయులు, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీలు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఎరువులు, మందుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రయ విక్రయాల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, మందులు అమ్మితే చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



షటిల్ టోర్నీని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు

డోన్ : క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో తోడ్పడతాయని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్ పేర్కొన్నారు. స్థానిక బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో శుభం విల్లాస్ సంస్థ యజమానులు రేగటి అర్జున్‌రెడ్డి, కొంగటి ప్రశాంత్ ఆధ్వర్యంలో జరుగుతున్న షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహించేందుకు శుభం విల్లాస్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచన మేరకు పెద్దమొత్తంలో ఫ్రెజ్‌మనీతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ భవిష్యత్తులో మరిన్ని టోర్నమెంట్‌లకు నాంది కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు జానకిరాం, సుమన్, సర్వజ్ఞమూర్తి, ప్రైవేట్ లెక్చరర్స్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, స్థానిక క్రీడాకారులు అనార్, జహీద్, వెంకట్రాం, ప్రేమ్, ఎల్లంధర్, విక్రం, సురేష్, శ్యామ్, నాగిరెడ్డి, జగదీష్, కరుణాకర్, సిద్దారెడ్డి, కౌన్సిలర్ రైల్వే నాగేంద్ర పాల్గొన్నారు.

మిద్దెపల్లి -ఎద్దుపెంట రోడ్డు కళకళ



నాడు మిద్దెపల్లి - ఎద్దుపెంట రోడ్డు దుస్థితి



నేడు మెరుస్తున్న దృశ్యం

- నేడు ప్రారంభించనున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ పట్టింది. మండల పరిధిలోని మిద్దెపల్లి – ఎద్దుపెంట గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన రోడ్డు కళకళలాడుతుంది. గతంలో అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడేవారు. స్థానిక నాయకులు మంత్రి బుగ్గన దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 2.50కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు 3.80 కిలో మీటర్ల మేర నిర్మించిన రోడ్డును ఆదివారం మంత్రి బుగ్గన ప్రారంభించనున్నారు. అనంతరం ఈ రోడ్డుపై మిద్దెపల్లె నుంచి ఎద్దుపెంట వరకు మంత్రి పాదయాత్ర చేస్తారని పంచాయతీరాజ్ ఏఈ మహేష్ తెలిపారు. ఏళ్లతరబడి నెలకొన్న రోడ్డు సమస్య తీరడంతో ఆయా గ్రామాల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తూ అర్హులకు న్యాయం చేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయం అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యుడు మూర్తుజావలీ, మైనార్టీ ఫైనాన్స్‌కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లో ఎంపీడీఓ వెంగన్న, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరన్న, గ్రామ సర్పంచ్ ఏస్తేరమ్మ, ఉప సర్పంచ్ మమత, ఎంపీటీసీలు ఇందిర, శాంతిల, బుగ్గానిపల్లె తండా సర్పంచ్ ఆదిలక్ష్మిబాయి ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన 27 మంది, బుగ్గానిపల్లె తండాకు చెందిన ముగ్గురు వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను ఎంపీపీ, ఎంపీడీఓ అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు అందరి మన్ననలు పొందుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నీతి, నీజాయితీతో సంక్షేమ పథకాలు అందజేయడంలో వలంటీర్ల పాత్ర కీలకం అన్నారు. ఏలాంటి దళారి వ్యవస్థకు తావు లేకుండా మీరు అందిస్తున్న సేవలతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు, తిరుమలేశ్వర్‌రెడ్డి, యాకోబ్, సత్యం, ఎద్దులన్న, జాకబ్, జేమ్స్, రఫీ, ఐజయ్య, హుసేన్ వలీ, నాగేశ్వరావు, రామనాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

- మరింత బాధ్యతగా ప్రజలకు సేవలందించాలి
- అర్హులకు సంక్షేమ పథకాల వర్తింపులో మీదే కీలకపాత్ర
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న వలంటీర్లు సంక్షేమ సారథులని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక వీఆర్, ఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో వలంటీర్లకు వందనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని కలుగొట్ల, బిజనవేముల సచివాలయ పరిధిలో సేవా వజ్రకు ఎంపికైన దస్తగిరి, బాలమద్దిరాజు, సేవారత్నకు ఎంపికైన సాదరదిన్నె, కలుగొట్ల, చిన్నకొప్పెర్ల, కోవెలకుంట్ల సచివాలయాల పరిధిలోని మిన్నల్లగారి కౌసర్, మధుకిషోర్, కత్తి తిరుపతయ్య, మధు ఆంజనేయులు, జనార్దన్‌తోపాటు సేవామిత్ర పొందిన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు జెడ్పీటీసీ సభ్యురాలు గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచారకార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, న్యాయ విభాగ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ అందరి మన్ననలు పొందుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2024లో తిరిగి అధికారంలోకి రావాలంటే వలంటీర్లు మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజల్లో జగన్ ప్రభుత్వంపై విశ్వాసం పెంచాలన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి 32 రకాల సంక్షేమ పథకాలు గడపవద్దకే చేరుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో నాయకులు దోచుకోవడం, దాచుకోవడం ధ్యేయంగా పనిచేశారని ఆరోపించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శమన్నారు. ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత నెలలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం రాష్ట్రంలోని బనగానపల్లె నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇందు కోసం కృషి చేసిన గ్రామ వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్, సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీవీశేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఓబుళపతిరెడ్డి, బాలమద్దిలేటి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓపీఆర్డీ రాధిక, ఈఓ బాలాంజనేయులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎల్‌వీసీ రామసుబ్బారెడ్డి, పేరా నాగార్జునరెడ్డి, అందె శ్రీనివాసరెడ్డి, మల్లు హరినాథరెడ్డి, అమడాల వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్ రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, రామసుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీమద్దిలేటిస్వామి ఆదాయం రూ.8,81,872





ప్రత్యేక అలంకరణలో మద్దిలేటి నరసింహస్వామి, స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రం శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లా నలుమూలలతోపాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కల్యాణకట్ట తదితర సేవల ద్వారా రూ. 8,81,872 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి,ఆకుల రమణ, మద్దయ్య, కృష్ణారెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని కల్వటాల రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొలిమిగుండ్లకు చెందిన యువకుడు మల్లికార్జునకు గాయాలయ్యాయి. పని నిమిత్తం బైక్‌లో తిమ్మనాయినపేటకు వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా కొలిమిగుండ్ల సమీపంలోని పెట్రోల్ బంక్‌లోకి డీజిల్ కోసం వెళ్తున్న లారీ వెనుక భాగాన ఢీకొనడంతో తలకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారులో మంటలు.. ప్రయాణికులు సురక్షితం

బనగానపల్లె: మండలంలోని కాపులపల్లి, మిట్టపల్లి గ్రామాల మధ్య ఎస్సార్‌బీసీ కెనాల్ సమీపంలో శనివారం మధ్యాహ్నం కారులో మంటలు చెలరేగాయి. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు అప్రమత్తమై సురక్షితంగా బయటపడ్డారు. ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన శివకుమార్ బంధువులు శుభకార్యం నిమిత్తం కర్నూలుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఫైర్ స్టేషన్ ఎస్ఐ నరసింహులు తెలిపారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి

డోన్ టౌన్: గ్రూప్1, గ్రూప్2 పోస్టులు పెంచాలని, మెగా డీఎస్సీ ద్వారా 50వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య రోజు రోజుకు పెరుగుతూ పోతుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటికీ తక్షణమే నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. అలాగే సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల నియమాకాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో నాయకులు నాగరాముడు, రణత్, దివాకర్, రాఘవేంద్ర, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

డోన్ టౌన్: ప్రైవేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దనుంజయుడు, సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడు రంగరత్నం, మండల కార్యదర్శి రామ్మోహన్ అధికారులను కోరారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ సమీపంలో కర్నూలు ప్రధాన రహదారిపై శనివారం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండ పేద విద్యార్థులను మభ్యపెడుతూ అధిక ఫీజులు, పుస్తకాలు, బస్సుల రవాణ పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధ్రతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సిద్ధార్థ, నాయకులు మనోజ్, శ్రీనివాసులు, రాముడు, పవన్, రాజు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

డోన్ టౌన్ : వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని తారకరామనగర్, ఇందిరాగాంధీ నగర్ సచివాలయాల్లో వలంటీర్లను ఘనంగా సన్మానించారు. తారకరామనగర్ సచివాలయంలో వలంటీర్లకు కౌన్సిలరు గొల్ల వెంకట్రాముడు, కో ఆప్షన్‌మెంబరు కుమ్మరి రాజు తదితరులు వలంటీర్లకు అవార్డు అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. అదేవిధంగా ఇందిరాగాంధీ నగర్ సచివాలయంలో కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, మేకల విమల, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దారా ప్రతాప్‌రెడ్డి వలంటీర్లకు అవార్డు అందజేసి శాలువాలతో సత్కరించారు. వలంటీర్ల సేవలను కౌన్సిలర్లు గుర్తు చేశారు. ఇంకా మెరుగైన సేవలు అందజేసి ప్రజల మన్ననలు పొందాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో సంక్షేమ అధికారి రమేష్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న కౌన్సిలర్లు



వలంటీర్లను సన్మానించిన దృశ్యం